
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం, 1, జూలై, 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 29.964 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయంలో 91.586 మీటర్ల నీటిమట్టం నమోదైంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.59,830
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,373
3 శాతం జీఎస్టీతో.. -	రూ.5,534
నవర (8 గ్రా) -	రూ.44,272

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.4 /27.0

శుక్రవారం గాలిలో తేమ 40 శాతం ఉంది. శనివారం ఎండ తీవ్రత, అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి పెన్షన్ల పంపిణీ

నెల్లూరు (పొగతోట): వైఎస్సార్ పెన్షన్ కానుకను లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలను జిల్లా యంత్రాంగం చేపట్టింది. ఈ నెల 1వ తేదీ తెల్లవారుజాము నుంచి వైఎస్సార్ పెన్షన్ కానుకను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. జిల్లాలో 3,04,686 మంది లబ్ధిదారులకు రూ.84.67 కోట్ల పింఛన్ నగదును అందజేయనున్నారు. వలంటీర్లు తెల్లవారుజాము నుంచి అవ్వాతాతలకు పింఛన్ నగదును పంపిణీ చేయనున్నారు.

4 వరకు అభ్యంతరాల స్వీకరణ

నెల్లూరు(సెంట్రల్): వైఎస్సార్ ఉచిత పంటల బీమాకు సంబంధించి జూలై 4వ తేదీ వరకు రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుధాకర్‌రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 3వ తేదీ వరకు స్థానిక రైతుభరోసా కేంద్రాల్లో లబ్ధిదారుల పేర్లను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల పేర్లలో ఏవైనా సమస్యలు ఉంటే 4వ తేదీ లోపు అభ్యంతరాలు తెలుపవచ్చని పేర్కొన్నారు.

జాతీయ పురస్కారాలకు 15 లోపు ప్రతిపాదనలు

నెల్లూరు(టౌన్): 2023వ సంవత్సరానికి సంబంధించి జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఈ నెల 15వ తేదీ లోపు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రతిపాదనలు పంపాలని డీఈఓ గంగాభవాని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిపాదనలను https:// nationalawards toteachers. education.gov. in వెబ్‌సైట్ ద్వారా పంపాలని తెలిపారు. ఇతర వివరాలను www. deonellore.50 web. com ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు.

నేటి నుంచి చేపల వేట నిషేధం

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని జలాశయాల్లో జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు చేపల వేటను నిషేధిస్తున్నట్లు మత్స్యశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జలాశయాల్లో మత్స్య సంపదను అభివృద్ధి చేయడంలో భాగంగా ఈ వేట నిషేధం విధిస్తున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కన్వర్షన్‌కు అవకాశం


నెల్లూరు (టౌన్): స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్) ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్)గా కన్వర్షన్ అయ్యేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు డీఈఓ గంగాభవాని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుముఖత ఉన్న ఉపాధ్యాయులు అనుమతి లేఖలను ప్రొఫార్మా ప్రకారం జూలై 3 లోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

‘జగనన్న సురక్ష’.. ప్రజలకు రక్ష

ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు సంక్షేమ పథకాలు అందని వారు ఎవరూ ఉండకూడదనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ‘జగనన్న సురక్ష’ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సచివాలయాల పరిధిలో నెల రోజులపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల సమస్యలను అధికారులు స్వయంగా తెలుసుకుని పరిష్కరించనున్నారు. వారికి అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లు జారీ చేయనున్నారు. శనివారం నుంచి ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి కలెక్టర్ ఎం.హరి నారాయణన్ ఆధ్వర్యంలో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

- నేటి నుంచి నెల రోజులపాటు కార్యక్రమం
- మొదటగా 93 సచివాలయాల్లో ప్రారంభం
- ఇంటింటి సర్వే నిర్వహించేలా ప్రణాళిక
- నేడు 58 వేల వినతులకు పరిష్కారం
- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం





సాక్షి ప్రతినిధి, నెల్లూరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ నవరత్నాల సంక్షేమ ఫలాలు అందాలనే లక్ష్యంతోపాటు ‘జగనన్నకు చెబుదాం’ కార్యక్రమంలో వచ్చే వినతులను అనుసంధానం చేసుకుని నెల రోజులపాటు ప్రజల సమస్యలను పరిష్కరించేలా ‘జగనన్న సురక్ష’ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. గత నెల 23వ తేదీన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని మొత్తం 769 సచివాలయాలు ఉండగా, వాటిలో 549 గ్రామ సచివాలయాలు, 220 వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఈ సచివాలయాల్లో శనివారం నుంచి ‘జగనన్న సురక్ష’ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించనున్నారు. సచివాలయాల పరిధిలో ప్రజల నుంచి అందిన వినతులకు పరిష్కారాన్ని చూపనున్నారు. ప్రజలకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను అందించేలా చర్యలు చేపట్టారు. అధికారుల కార్యకలాపాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారంలో మూడు రోజులపాటు ‘జగనన్న సురక్ష’ కార్యక్రమాన్ని నిర్వహించేలా కలెక్టర్ ఎం.హరినారాయణన్ ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేశారు.

93 సచివాలయాల్లో..

గ్రామ, వార్డు సచివాలయాల వద్ద మండలస్థాయి అధికారుల బృందాల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక క్యాంపుల ద్వారా వచ్చిన అర్జీలకు పరిష్కారం చూపనున్నారు. అర్హులు ఏ ఒక్కరూ మిగిలిపోకుండా ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. తొలిరోజు జిల్లాలో 93 సచివాలయాల్లో ‘జగనన్న సురక్ష’ కార్యక్రమం ప్రారంభం కానుంది. వాటిలో 68 గ్రామ, 25 వార్డు సచివాలయాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

58 వేల వినతులు

ఇప్పటి వరకు నిర్వహించిన ‘జగనన్న సురక్ష’ క్యాంపుల్లో మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలను తెలుసుకోగా మొత్తం 58 వేల అర్జీలు వచ్చాయి. వీటిలో ఎక్కువగా 6 వేల వినతులు ఆధార్ అప్‌డేట్ కోసం ఉన్నాయని తెలుస్తోంది. మిగిలిన సమస్యలను కూడా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

మైక్‌లో ప్రచారం.. వాట్సప్.. ఎస్‌ఎంఎస్‌లు..

సచివాలయాల పరిధిలో జరగనున్న ‘జగనన్న సురక్ష’ కార్యక్రమం గురించి అధికారులు గ్రామాల్లో మైకుల ద్వారా ప్రచారం చేయించారు. అదేరోజు ఇంటింటికీ వెళ్లే కార్యక్రమాన్ని కూడా చేపట్టారు. ప్రజలకు ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు అవసరమో వివరాలు సేకరించారు. అలాగే ‘జగనన్న సురక్ష’ కార్యక్రమం ఏ రోజు నిర్వహిస్తారో.. ముందుగా సచివాలయాల పరిధిలో నమోదైన ఫోన్‌నంబర్లకు ఎస్‌ఎంఎస్‌ల ద్వారా కూడా సందేశం పంపుతున్నారు. వలంటీర్ల ఇంటింటి సందర్శనకు సంబంధించి గ్రామ, వార్డు సచివాలయాల శాఖ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ నిర్వహించి అందరి అధికారులకు కలెక్టర్ సమాచారం చేరవేశారు. సచివాలయాల వద్ద మండలస్థాయి అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు టోకెన్లు జారీ చేశారు. ముందుగా ఆన్‌లైన్‌లో టోకెన్లు జారీ చేసిన వారికి మాత్రమే క్యాంపులో సర్వీసు చార్జీల మినహాయింపు ఇచ్చి ధ్రువీకరణ పత్రాలు అందజేయనున్నారు. ‘జగనన్న సురక్ష’ కార్యక్రమంలో ధ్రువీకరణ పత్రాలు అందుకున్న వారు 9052690526 నంబర్‌కు ‘థ్యాంక్యూ జగన్ సర్’ అంటూ మెసేజ్‌లు పంపనున్నారు.

కార్యక్రమాలు ఇలా..

జిల్లాలో 4వ తేదీన 82 సచివాలయాలు, 6న 70 సచివాలయాలు, 8వ తేదీన 24, 11వ తేదీన 74, 13వ తేదీన 76, 15వ తేదీన 67, 18వ తేదీన 65, 20వ తేదీన 64, 22వ తేదీన 49, 25వ తేదీన 51, 27వ తేదీన 45, 29వ తేదీన 7 సచివాలయాల్లో ‘జగనన్న సురక్ష’ కార్యక్రమాలు నిర్వహించేలా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు.

జిల్లాలో..

మొత్తం సచివాలయాలు -	769
గ్రామ సచివాలయాలు -	549
వార్డు సచివాలయాలు -	220
ఇప్పటి వరకు అందిన అర్జీలు - సుమారు	58 వేలు

నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు వీరే..

‘జగనన్న సురక్ష’ కార్యక్రమానికి జిల్లాస్థాయి నోడల్ అధికారిగా డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డిని కలెక్టర్ నియమించారు. వారితోపాటు సర్వేపల్లి నియోజకవర్గానికి జేసీ కూర్మనాథ్, నెల్లూరు సిటీకి నగర కమిషనర్ వికాస్‌మర్మత్, రూరల్‌కు ఆర్డీఓ మలోల, వెంకటగిరికి జెడ్పీ సీఈఓ చిరంజీవి, ఉదయగిరికి డ్వామా పీడీ వెంకట్రావ్, ఆత్మకూరుకు ఆర్డీఓ కరుణకుమారి, కోవూరుకు డీపీఓ సుస్మితారెడ్డి, కందుకూరుకు సబ్‌కలెక్టర్ శోభిక, కావలికి ఆర్డీఓ శీనానాయక్‌లను నోడల్ అధికారులుగా నియమించారు.

ప్రతిష్టాత్మకంగా..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ‘జగనన్నకు చెబుదాం’ కార్యక్రమాన్ని అనుసంధానం చేస్తూ ‘జగనన్న సురక్ష’ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రధాన లక్ష్యం. అలాగే ఇంటింటికీ తిరిగి వారి సమస్యలను తెలుసుకుని ‘జగనన్న సురక్ష’ కార్యక్రమంలో పరిష్కరించేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– ఎం.హరినారాయణన్, కలెక్టర్

కోటంరెడ్డికి ఝలక్..!

- నెల్లూరు నగర ఇన్‌చార్జి పదవి నుంచి తప్పించిన అధిష్టానం
- మాజీ మంత్రి పి.నారాయణకు అప్పగింత
- పదవి నుంచి తొలగించడంతో లబోదిబో

లోకేశ్ చేస్తున్న యువగళం పాదయాత్ర జిల్లా టీడీపీలో ముసలం పుట్టిస్తోంది. జిల్లాలో జరిగే పాదయాత్ర విజయవంతం పేరుతో వైఎస్సార్‌సీపీ నుంచి సస్పెండ్ అయిన నేతలను పార్టీలోకి ఆహ్వానించి పార్టీని నమ్ముకున్న నేతలకు హ్యాండిస్తున్నారు. ఇప్పటికే ఆత్మకూరు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ నేతలకు ఝలక్ ఇచ్చిన టీడీపీ పెద్దలు తాజాగా నెల్లూరు నగర నియోజకవర్గంలో కూడా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి ఇదే సీన్ చూపించారు. నగర ఇన్‌చార్జి పదవి నుంచి తప్పించి మాజీ మంత్రి నారాయణకు ఆ పదవి ఇవ్వడంతో కోటంరెడ్డి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ నెల్లూరు నగర ఇన్‌చార్జి పదవిలో ఉన్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి టీడీపీ నేత లోకేశ్ యువగళం పాదయాత్రను విజయవంతం చేసేందుకు నిధులను సమకూర్చుకునే ప్రయత్నాలు చేస్తున్నాడని తెలుస్తోంది. గత పది రోజుల నుంచే పాదయాత్ర పేరుతో వసూళ్లు చేస్తున్నట్లు ఆ పార్టీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. నగరంలో ఇప్పటికే ఫ్లెక్సీలు ఏర్పాటు చేయించిన కోటంరెడ్డి చిన్నాచితకా వ్యాపారుల నుంచి బడా వ్యాపారుల వరకు మరీ టార్గెట్లు పెట్టి దండకాలు చేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. నగరంలో ప్రధానంగా స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న వ్యాపారులందరికీ చందాలు ఇవ్వాలంటూ హుకుం జారీ చేసినట్లు ప్రచారం ఉంది. వ్యాపారాన్ని బట్టి రూ.25 వేల నుంచి రూ.5 లక్షల వరకు ఇవ్వాలంటూ వ్యాపారులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. యువగళం కోసం కోట్లాది రూపాయలు వసూలు చేయడమే లక్ష్యంగా నిర్ణయించుకున్న సదరు నేత ఇప్పటికే అధిక మొత్తంలో దండకాలు చేశారని ప్రచారం సాగుతోంది. అడిగిన వెంటనే చందాలు ఇవ్వని వ్యాపారులతో.. ‘వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తుందని.. అప్పుడు మీ అంతు చూస్తానంటూ’ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం. పలువురు వ్యాపారులు రాజకీయనేతలతో తమకెందుకని ఎంతో కొంత ఇచ్చి పంపుతున్నట్లు తెలుస్తోంది.

ఇన్‌చార్జి పదవి పోవడంతో..

టీడీపీ నెల్లూరు నగర ఇన్‌చార్జిగా రుబాబు చేసిన కోటంరెడ్డిని ఉన్న ఫళంగా ఇన్‌చార్జి నుంచి పదవి తీసెయ్యడంతో తన వసూళ్ల పర్వానికి బ్రేకులు పడ్డాయన్న కోపంతో రగిలిపోతున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. చందాలు ఇచ్చిన వ్యాపారులు మాత్రం బాధపడుతున్నట్లు తెలుస్తోంది.

కలగానే మిగిలిన టికెట్

కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి ఎమ్మెల్యే టికెట్ కలగానే మిగిలింది. రెండు దశాబ్దాలుగా టీడీపీలో కొనసాగుతున్న ఆయనకు పార్టీలో నామినేటెడ్ పదవి మాత్రమే లభించింది. ప్రజాక్షేత్రంలో ఆయన కౌన్సిలర్‌గా మాత్రమే విజయం సాధించారు. 2014, 2019 ఎన్నికల సమయంలో టీడీపీ టికెట్ నాదేనంటూ ప్రచారం చేసుకున్న కోటంరెడ్డికి పార్టీ ఝలక్ ఇచ్చింది. గతంలో పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన నేపథ్యంలో టీడీపీ సస్పెండ్ చేసిన సందర్భంగా కూడా ఉంది. తిరిగి ఎలాగోలా సినీ హీరో బాలకృష్ణ ద్వారా పార్టీలోకి వచ్చారు. ప్రతి దఫా టికెట్ నాదేనని ప్రచారాలు చేసుకోవడం పరిపాటిగా మారింది.

సబ్సిడీపై టమాటా విక్రయాలు ప్రారంభం



టమాటాల విక్రయాన్ని ప్రారంభిస్తున్న ఏడీ

నెల్లూరు(సెంట్రల్): సబ్సిడీపై టమాటా విక్రయాలను మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత నెల్లూరులోని ఫత్తేఖాన్‌పేట రైతుబజార్‌లో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ ప్రస్తుతం బయట మార్కెట్‌లో కిలో టమాటా ధర రూ.110కి పైగా ఉందని, ఈ నేపథ్యంలో ప్రభుత్వమే టమాటాలను కొనుగోలు చేసి కిలో రూ.50 చొప్పున ప్రజలకు సబ్సిడీపై విక్రయిస్తున్నట్లు తెలిపారు. నెల్లూరులోని ఫత్తేఖాన్‌పేట, నవాబుపేట రైతుబజార్లతోపాటు, కావలి, కందుకూరు రైతుబజార్లలో టమాటాలను సబ్సిడీపై విక్రయిస్తున్నామన్నారు. ప్రజల ఈ అవకాశాన్ని వినియోగించుకోలని సూచించారు. టమాటాల ధర తగ్గే వరకు సబ్సిడీపై విక్రయాలు కొనసాగిస్తామని తెలిపారు.

వైద్యశాలకు నిర్లక్ష్యం జబ్బు



ఈ చిత్రంలో కనిపిస్తున్న పెద్దామె ఉదయగిరి మండలం కర్రపల్లికి చెందిన వృద్ధురాలు వెంకటమ్మ. ఆమెకు బీపీ, షుగరు స్థాయిల్లో మార్పులు రావడంతో కుప్పకూలిపోయింది. కుటుంబసభ్యులు ఆటోలో ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. కానీ ఉదయం 10.45 గంటల వరకు వైద్యం చేసే డాక్టర్లు లేకపోవడంతో అక్కడ ఉన్న సిబ్బందే డాక్టర్ అవతారంలో వారికి తెలిసిన వైద్యం అందించాల్సిన దుస్థితి వచ్చింది.



ఉదయం 10.45 వరకు ఖాళీగా ఉన్న వైద్యుని కుర్చీ



ఈ చిత్రంలో కనిపిస్తున్న క్షతగాత్రుడు ఉదయగిరి మండలం గండిపాళేనికి చెందిన రామకృష్ణ. గురువారం ఉదయం నెల్లూరు నుంచి గండిపాళేనికి బైక్‌పై వస్తుండగా పాపంపల్లి వద్ద బైక్ అదుపు తప్పి పడిపోయాడు. దీంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108లో ఉదయగిరి సీహెచ్‌సీకి తరలించారు. కానీ అక్కడ వైద్యం చేసేందుకు డాక్టర్ లేక బెడ్‌పై నిస్సహాయంగా ఉండిపోయాడు.

- రోగుల కోసం అన్ని వసతులు కల్పించిన ప్రభుత్వం
- వైద్యులు ఉన్నా విధులకు హాజరు కాని వైనం
- వైద్యం అందక అవస్థలు పడుతున్న రోగులు
- ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో దుస్థితి

పైన పేర్కొన్న పరిస్థితులు ఎక్కడో ఒక కుగ్రామంలోనో.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనో కాదు. నియోజకవర్గ కేంద్రం ఉదయగిరి నడిబొడ్డున ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి రోజూ జరుగుతున్న తంతు. ప్రభుత్వం రూ.6 కోట్లతో ఆధునిక వైద్యశాలను నిర్మించింది. మరో రూ.2 కోట్లు ఖర్చు చేసి వైద్యానికి అవసరమైన పరికరాలు సమకూర్చింది. ఆరుగురు వైద్యులతోపాటు మరో 54 మంది సిబ్బందిని నియమించింది. నెలకు రూ.25 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. పేదలకు ఉచిత వైద్యం అందించాలనే సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యశాఖను ప్రక్షాళన చేసినా కొంతమంది వైద్యుల నిర్లక్ష్యంగా విధులకు డుమ్మా కొడుతూ ప్రభుత్వ ఆశయానికి తూట్లు పొడుస్తున్నారు. లక్షల రూపాయలు జీతం తీసుకుంటూ వృత్తి ధర్మం పాటించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

– ఉదయగిరి

మర్రిపాడు మండలం పోలిరెడ్డిపల్లికి చెందిన పోలినేని రమణయ్య 30 కి.మీ. ప్రయాణించి వైద్యం కోసం గురువారం ఉదయం 8 గంటలకు ఉదయగిరిలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. అక్కడ నాడి పట్టే దిక్కులేక మరోచోటకు వెళ్లలేక అక్కడే దీనంగా వైద్యుల రాక కోసం నిరీక్షించాల్సి వచ్చింది. ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండాలి. గురువారం ఉదయం 10.45 గంటల వరకు ఒక్కరూ అందుబాటులో లేరు. ఈ సమయంలో ఒక ప్రమాద కేసుకు సంబంధించి ఇద్దరు క్షతగాత్రులు, ప్రాణాపాయ స్థితిలో మరో మహిళ వైద్యశాలకు వచ్చారు. డాక్టర్లు అందుబాటులో లేరు. ఇదే మొదటిసారి కాదు. నెలలో ఎక్కువ రోజులు ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నామని అనేక మంది పేషెంట్లు వాపోతున్నారు.



ఉదయగిరిలోని సామాజిక ఆరోగ్య కేంద్రం



వైద్యుల కోసం ఎదురుచూస్తున్న రోగులు

దారుణంగా పడిపోయిన ఓపీ

గతంలో ఇక్కడ వైద్యులు నిబద్ధతతో పనిచేయడంతో ప్రతి రోజూ ఓపీ కనీసం 250 నుంచి 300 వరకు ఉండేది. అప్పట్లో వసతులు సక్రమంగా లేకపోయినా.. వైద్యసిబ్బంది అరకొరగా ఉన్నా.. ఓపీ మాత్రం బాగా ఉండేది. ఆస్పత్రికి ఎప్పుడు వెళ్లినా వైద్యం చేస్తారనే నమ్మకం ఉండడంతో పేషెంట్లు ఈ వైద్యశాలకే వెళ్లేవారు. కానీ ప్రస్తుతం అన్ని వసతులు, ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం ఆరుగురు వైద్యులను నియమించింది. సిబ్బంది, మందుల కొరత లేదు. కానీ నిబద్ధతతో పనిచేసే వారు లేకపోవడంతో ఓపీ దారుణంగా పడిపోయింది. కనీసం 100 మంది కూడా రావడం లేదని తెలుస్తోంది. కారణం ఇక్కడ వైద్యసేవలు సక్రమంగా అందుతాయనే నమ్మకం లేకపోవడమే. అంతేకాకుండా వైద్యులు, సిబ్బంది మధ్య ఆధిపత్యపోరు కొనసాగుతోందని తెలుస్తోంది. ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడం, చాడీలు చెప్పుకోవడం పరిపాటిగా మారిందని సమాచారం. ఇక్కడ విధులు నిర్వహించే ఓ డాక్టర్ స్కానింగ్ రూంను విశ్రాంతి గదిగా మార్చుకోవడంతో స్త్రీలు అక్కడ స్కానింగ్ చేయించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై ఫోన్‌లో వైద్యశాల డీడీఓ ఝాన్సీతో మాట్లాడగా ‘నా ఆరోగ్యం సరిగా లేనందున సెలవులో ఉన్నాను.. చార్ట్ ప్రకారం డ్యూటీ డాక్టర్లు విధులకు రావాల్సి ఉంది.. విధుల్లో సమయపాలన పాటించని వారిపై ఉన్నతాధికారులకు తెలియజేసి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని’ తెలిపారు.

• సేవా దృక్పథంతో వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు
• నేడు జాతీయ వైద్యుల దినోత్సవం

వైద్య దేవుళ్లు



నెల్లూరు(బారకాసు): వారు దేవుళ్లు కాదు.. కానీ ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి సకాలంలో చికిత్స అందించి పునర్జన్మనిస్తారు. బ్రహ్మ బొమ్మను చేసి ప్రాణమిస్తే..కొన ఊపిరితో ఉన్న మనిషికి ఆయువును అందించి అపరబ్రహ్మలవుతారు. వారే డాక్టర్లు. రోగికి దైవం కన్నా మిన్న. అందుకే వైద్యోనారాయణో హరి అంటారు పెద్దలు. అంటే వైద్యుడు నారాయణుడి(భగవంతుడు)తో సమానమని అర్థం. అందుకే ఎవరికి ఏ ఆరోగ్య సమస్య వచ్చినా వైద్యులకు ఖచ్చితంగా, దాపరికం లేకుండా చెప్పాలంటారు. మన సమాజంలో వైద్యులకు ఉన్నంత ప్రాధాన్యం వేరెవ్వరికీ ఉండదంటే అతిశయోక్తి కాదు. కానీ నేటి ఆధునిక కాలంలో సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తున్నా రోగి, వైద్యుల మధ్య సంబంధాలు దెబ్బతింటున్నాయి. అందుకు కారణం వైద్యం వ్యాపారంగా మారడమే. ప్రస్తుతం సేవా దృక్పథం కలిగి..పేద రోగులను ఆప్యాయంగా పలకరించి..మెరుగైన వైద్యం అందించే డాక్టర్లు అరుదుగా కనిపిస్తున్నారు. శనివారం డాక్టర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

తక్కువ ఖర్చుకే మెరుగైన వైద్యం

వైద్యం పేరుతో దోచుకుంటున్న ఈ రోజుల్లో నగరంలోని డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల, కన్యకల ఆస్పత్రి, నెల్లూరు ఆస్పత్రుల్లో తక్కువ ఖర్చుకే ఖరీదైన వైద్యం అందుతోంది. అందుకు కారణం ఆయా ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులే. కేవలం బతికేందుకు అవసరమైన మేరకే జీతం తీసుకుంటూ ప్రజాసేవ చేయాలనే దృక్పథంతో ఆయా ఆస్పత్రుల్లోని వైద్యసిబ్బంది పనిచేయడం వలనే పేదలు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం పొందగలుగుతున్నారు.

పేదల సేవలోనే సంతృప్తి..

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తూ.. అక్కడి నిరుపేదలకు వైద్యం అందిస్తూ ప్రముఖ నరాల వైద్య నిపుణురాలు డాక్టర్ బిందుమీనన్ తనవంతు సేవచేస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో జన్మించిన ఈమె నెల్లూరు జిల్లా ప్రజలకు వైద్య సేవలందిస్తోంది. 9ఏళ్ల క్రితం డాక్టర్ బిందుమీనన్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ఆమె ఆ సంస్థ ద్వారా తన సొంత నిధులతో 250 మంది నిరుపేద పక్షవాత, మూర్ఛ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా వైద్య సేవలందిస్తూ అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నారు. అంతేకాకుండా జిల్లా ప్రజలకు న్యూరాలజీ ఆన్ వీల్(సంచార వైద్య చికిత్స వాహనం) ద్వారా ఉచితంగా వైద్య సేవలందిస్తున్నారు. మూర్ఛ, పక్షవాతంపై సందేశాలను నివృత్తి చేయడంతో పాటు సూచనలు, సలహాలు అందజేసేందుకు 18008 916977 టోల్‌ఫ్రీ నంబర్‌తో పాటు ఎపిలెప్సీ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆమె సేవలను గుర్తిస్తూ 2015లో ఇండియన్ ఎపిలెప్సీ అసోసియేషన్ 'హెచ్- సీ-బజోరియా ఓరియేషన్ అవార్డును ప్రదానం చేశారు. అలాగే పలు నేషనల్, ఇంటర్నేషనల్ సంస్థలు పలు అవార్డులను ప్రదానం చేసి సేవలను ప్రశంసించాయి. 2017 సెప్టెంబర్‌లో స్పెయిన్ దేశంలో ఇంటర్నేషనల్ ఎపిలెప్సీ ఎగైనెస్ట్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ బిందుమీనన్ లీడర్‌షిప్ అవార్డును అందుకున్నారు.

డాక్టర్ బీసీరాయ్ స్ఫూర్తితో వైద్యులు కృషి చేయాలి



వైద్యుడ్ని దైవసమానుడిగా గుర్తించే స్థాయి నుంచి పేదల రక్తం పీల్చే పిశాచి అన్న స్థాయికి చేరుకున్న ప్రస్తుత పరిస్థితుల్లో వైద్య మహోదయులపై ఈ అభిప్రాయాన్ని తొలగించాల్సిన బాధ్యత మరింత అధికంగా ఉంది. కార్పొరేట్ కల్చర్‌కు అలవాటు పడిన అధిక శాతం మంది వైద్యులు మానవీయకోణాన్ని విస్మరించి ఎన్నిరకాల అవకాశాలుంటే అన్ని రకాలుగా రోగులను పిండుతున్నారు. కొంతమంది అత్యాశపరుల వల్ల పూర్తి వ్యవస్థకే చెడ్డ పేరు వస్తున్న పరిస్థితిని నివారించాల్సిన అవసరం ఉంది. వైద్యులు రోగులపై తమ దృక్పథాన్ని మార్చుకుని, ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించాలి. ప్రజావైద్యుడిగా విశేషఖ్యాతి గడించిన డాక్టర్ బీసీరాయ్‌ను ఆదర్శంగా తీసుకుని వైద్యవృత్తిపై పడిన కళంకాన్ని తొలగించడానికి ప్రతిఒక్క వైద్యుడు ఆచరణాత్మక కృషి చేయాలి.

– ఎంవీ రమణయ్య, సీనియర్ వైద్యుడు, ప్రజావైద్యశాల.

పోలీసు సిబ్బంది సంక్షేమమే ప్రథమ కర్తవ్యం

• ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి



పోలీసు సిబ్బంది సమస్యలను వింటున్న ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): శాంతిభద్రతల పరిరక్షణలో అహర్నిశలు శ్రమిస్తున్న పోలీసు సిబ్బంది సంక్షేమమే ప్రథమ కర్తవ్యమని, వారి సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్పీ కే తిరుమలేశ్వర రెడ్డి హెచ్చరించారు. పోలీసు కార్యాలయంలో పోలీసు వెల్ఫేర్ డేను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బంది తమ సమస్యలను ఎస్పీకి విన్నవించారు. ప్రధానంగా ప్రమోషన్లు, అనారోగ్యం, బదిలీలు, సర్వీస్ సంబంధిత సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని పరిశీలించిన ఎస్పీ సమస్యలతో పాటు విరమణ పొందిన ఎస్సైలు, హెచ్‌సీల పెండింగ్ ఇంక్రిమెంట్స్‌ను వెంటనే పరిష్కరించాలని డీపీఓ కార్యాలయ అధికారులను ఆదేశించారు.

వృత్తిపరమైన, ఆరోగ్యపరమైన, మహిళా కానిస్టేబుళ్ల సమస్యల అర్జీలను సత్వరమే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ డీ హిమవతి, డీపీఓ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

2024 ఎన్నికలే బాబుకు చివరివి



మాట్లాడుతున్న కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

• బాబు పాలనలో రాష్ట్రం సర్వనాశనం
• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: గత రెండ్రోజులుగా చంద్రబాబునాయుడు, ఆయన భజన బృందం వైఎస్సార్‌సీపీ సంక్షేమ ప్రభుత్వంపై అవాకులు, చవాకులు పేలుతున్నారని, ఆయన జీవితంలో ఇక సీఎం కాలేరని, 2024 ఎన్నికలే చివరివి కావొచ్చని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందుకూరుపేటలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో ఏ నాడు ప్రజాసమస్యలను పట్టించుకోలేదని, కేవలం తన స్వలాభం కోసమే పనిచేశారన్నారు. రాష్ట్ర విభజన తరువాత మన పరువును కేంద్రం కాళ్ల దగ్గర తాకట్టుపెట్టి, కమీషన్లకు కక్కుర్తిపడి ప్యాకేజీల కోసం పరుగులు తీశారన్నారు. అటువంటి వ్యక్తి తమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. గత ఎన్నికల సమయంలో 600 మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి ప్రజలను చంద్రబాబు నట్టేట ముంచాడన్నారు. పొదుపు రుణాలను మాఫీ చేస్తామని అక్కచెల్లెమ్మలను సైతం బాబు మోసం చేశారని గుర్తుచేశారు. వైఎస్ జగన్ పాదయాత్ర సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఆసరా పథకం కింద విడతల వారీగా రూ.18వేల కోట్లు అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేశారన్నారు. చంద్రబాబు ప్రభుత్వం చేసిన బాకీలను సైతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. టీడీపీ నాయకులు ప్రెస్‌మీట్లు పెట్టి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాగ్దానాలు 97శాతం చేయలేదని చెప్పడం, ఈ మాటలను ఎల్లోమీడియా తప్పుడు రాతలుగా రాయడం వారి దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చిందని ప్రజల్లోకి వెళ్లి ధైర్యంగా చెప్పగలిగే దమ్ము తమకు ఉందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలని పోరాటం చేసింది, చేస్తున్నది తమ ప్రభుత్వమేనన్నారు. చంద్రబాబునాయుడుకు మతిభ్రమించడంతో పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని, ఆయన వయోభారంతో అయోమయంగా వ్యవహరిస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ, చంద్రబాబునాయుడుకు 2024 ఎన్నికలే చివరి ఎన్నికలని, ఆ తరువాత ఆంధ్రప్రదేశ్‌లోని నారావారిపల్లి, తెలంగాణలోని హైదరాబాద్‌లో సేదతీరడం తప్పదన్నారు. చంద్రబాబు ఏ సేనతో కలిసినా కాబోయే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. చంద్రబాబును ప్రజలు నమ్మేపరిస్థితుల్లో లేరన్నారు. సంక్షేమ, పారదర్శక పాలనతో ప్రజల మనస్సుల్లో జగన్‌మోహన్‌రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. రానున్న రోజుల్లో టీడీపీ భూస్థాపితం కావడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరి శ్రీనివాసులరెడ్డి, డీసీఎమ్మెస్ డైరెక్టర్ గునపాటి సురేష్‌రెడ్డి, జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ శ్రీహరికోట జయలక్ష్మి, గురజాల బుజ్జిబాబు, వేళ్ల భానుచంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

దంత సమస్యలపై అవగాహన అవసరం



దంత పరీక్షలు చేస్తున్న డాక్టర్

నెల్లూరు(బారకాసు): దంత సమస్యలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని దంత వైద్యురాలు భవాని పేర్కొన్నారు. డాక్టర్ కిరణ్స్ స్మైల్ సూపర్‌స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వే ఇంజినీరింగ్ కార్యాలయంలో ఉచిత దంత అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భవాని మాట్లాడుతూ దంతాలు ఆరోగ్యంగా ఉంటేనే మానవ శరీరం సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. దంతాలు అనారోగ్యానికి గురైతే శరీరంలోని ఇతర భాగాలు దెబ్బతింటాయని హెచ్చరించారు. ఈ ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ఐవీరమణారావు మాట్లాడుతూ దంత సమస్యలపై అవగాహన కల్పించేందుకు సదస్సు నిర్వహించడం సంతోషకరమన్నారు. అనంతరం దాదాపు 100 మందికిపైగా రైల్వే ఉద్యోగులకు వైద్యులు భవాని, సంధ్య దంత పరీక్షలు నిర్వహించారు. గూడూరు రైల్వే హాస్పిటల్ డీఎం ఐ.శ్రీనివాసరావు, నెల్లూరు ఏడీఎన్ అపూర్వవశిష్ట, ఎస్ఎస్ఈ ఇన్‌చార్జి బ్రహ్మాజీరావు, సంఘ సెక్రటరీ నాగరాజు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఓగూరులో జిల్లా ప్రత్యేకాధికారి పర్యటన



అర్హుల జాబితాను పరిశీలిస్తున్న సీహెచ్ హరికిరణ్

కందుకూరు రూరల్: రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్, నెల్లూరు జిల్లా ప్రత్యేకాధికారి సీహెచ్ హరికిరణ్ మండలంలోని ఓగూరులో శుక్రవారం పర్యటించారు. ఆర్‌బీకేలో రికార్డులను తనిఖీ చేశారు. కియోస్క్ పనితీరును పరిశీలించారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించారు. రేషన్ కార్డుల్లో విద్యార్థుల పేర్లు లేకపోవడానికి కారణం ఏమిటీ..ఎందుకు సమస్యను పరిష్కరించలేదని వీఆర్వో నాగరాజును ప్రశ్నించారు. విలేజ్ హెల్త్‌క్లినిక్‌లో అందిస్తున్న వైద్యసేవలపై ఎంఎల్‌హెచ్‌పీ టీ అలేఖ్యను ఆరాతీశారు. అనంతరం ఆదిఆంధ్ర కాలనీ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన వెంట కందుకూరు సబ్‌కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, జేడీఏ జీ సుధాకర్‌రాజు, ఎంపీడీఓ పీ విజయశేఖర్, తహసీల్దార్ మంజునాథ్‌రెడ్డి, ఏడీఏ పీ అనసూయ, ఏఓ వీ రాము, ఎంఈఓలు వెంకటేశ్వరనాయక్, సుబ్బారెడ్డి ఉన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 147
లేయర్ (లైవ్) : 108
బ్రాయిలర్ చికెన్ : 250
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 280
లేయర్ చికెన్ : 184

నిమ్మధరలు పొదలకూరు (కిలో)



పెద్దవి : రూ. 25
సన్నవి : రూ.15
పండ్లు : రూ. 5

డిగ్రీ పరీక్షల్లో నలుగురు విద్యార్థులు డిబార్

వెంకటాచలం: వీఎస్‌యూ అనుబంధ కళాశాలల్లో శుక్రవారం నిర్వహించిన డిగ్రీ పరీక్షల్లో నలుగురు విద్యార్థులు డిబార్ అయ్యారని వీఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి ఆర్ ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నిర్వహించిన నాల్గో సెమిస్టర్ పరీక్షకు 11508 మందికి గానూ 10653 మంది హాజరయ్యారని, 855 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. విడవలూరులోని పీఆర్ ఆర్అండ్‌వీఎస్ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, నెల్లూరు వీఆర్ డిగ్రీ కళాశాలలో ఒకరు డిబార్ అయ్యారని తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన ఆరో సెమిస్టర్ పరీక్షకు 318 మందికి గానూ 286 మంది హాజరయ్యారని, 32 మంది గైర్హాజరయ్యారని వివరించారు. ఒకరు డిబార్ అయ్యారని తెలిపారు.

* మనం మాట్లాడుకోవాల్సిందే!

అధునికత పేరుతో మన మధ్యలోకి డ్రగ్స్ అనే భూతాలు వచ్చాయి. పబ్ కల్చర్ పెరుగుతున్న ఈ రోజుల్లో అబ్బాయిలే కాదు అమ్మాయిలు కూడా డ్రగ్స్‌కు బానిసలవుతున్నారు. ఈ సమస్య బారిన పడకుండా ఉండాలన్నా, డ్రగ్స్‌కు అడిక్ట్ అయినా మనం మాట్లాడుకోవాల్సిందే!


ప్రతీకాత్మక చిత్రం

డ్రగ్స్‌కు దూరంగా ఉందాం..!

'ఈ దశాబ్దం చివరి నాటికి, ప్రపంచవ్యాప్తంగా డ్రగ్స్ వాడేవారి మోతాదులో దాదాపు 11 శాతం పెరుగుదల ఉంటుంద'ని 'యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్' తన నివేదికలో పొందుపరిచింది. ఇది ఒక సామాజిక సమస్య. మత్తుకు బానిస కావడానికి కారణాలు వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులతో ముడిపడి ఉంటాయి. విద్య, వృత్తి, కుటుంబ ఆదాయం, జెండర్, సామాజిక పోకడలు.. అన్నీ వ్యసనానికి లొంగిపోయే వ్యక్తి ఆలోచనా విధానంపై ప్రభావం చూపుతాయి.

• • •

బర్త్ డే పార్టీ అని వెళ్లిన కూతురు సోనీ (పేరు మార్చడమైనది) రాత్రి నుంచి ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వస్తోంది. తన స్నేహితులను కనుక్కుంటే తెలియదనే సమాధానం వచ్చింది. మూడు నెలలుగా సోనీ ప్రవర్తనలో వచ్చిన మార్పులు అమ్మను తెగ భయపెడుతున్నాయి. ఇదే విషయమై భర్తతో చెప్పింది. సోనీ వారికి ఒక్కతే కూతురు. అడిగినవన్నీ అమర్చిపెట్టగలిగే స్థోమత గల కుటుంబం.

సోనీ బీటెక్ సెకండియర్ చదువుతోంది. ఇంటర్మీడియెట్ వరకు ఇంట్లో ఎంత చెబితే అంత అన్నట్టుగా ఉన్న అమ్మాయి ఒక్కసారిగా ఫ్రెండ్స్ బర్త్ డే అనీ, గెట్ టుగెదర్ అనీ, కాలేజీ ఫ్రెషర్స్ డే అనీ, ఫేర్వెల్ అనీ... ఈ మధ్య పార్టీలు బాగా పెరిగిపోయాయి. పార్టీ అన్నప్పుడల్లా డబ్బులు ఇవ్వక తప్పేది కాదు. ఆమె రావడం ఆలస్యం కావడంతో ఓరోజు ఆమె ఫ్రెండ్స్ ద్వారా ఎంక్వైరీ చేసి, తను ఎక్కడ ఉందో తెలుసుకొని వెతుక్కుంటూ అక్కడికి వెళ్లారు.


ప్రతీకాత్మక చిత్రం

కృత్రిమ ఆనందం

- డ్రగ్స్‌కు అలవాటు పడితే ఏం చెప్పినా వినరు. డబ్బులు ఇవ్వకపోతే దొంగతనం చేయడం, పెద్దవాళ్ల మీద చేయి చేసుకోవడం, ఇంకా చేయకూడని పనులు చేసి ఎలాగైనా సరే డ్రగ్స్ తీసుకుంటారు.
- వాళ్లకి వాళ్ల డ్రగ్స్‌కి మధ్యన ఎవరు వచ్చినా భరించరు. అంటే.. తల్లి, తండ్రీ, స్నేహితులు... ఎవ్వరొచ్చినా తట్టుకోలేరు.
- యూత్‌కి బాగా నచ్చే పదాలు 'కొత్తదనాన్ని ఎక్స్‌పీరియెన్స్ చేయాలి.' దీనివల్లే ప్రతీ డ్రగ్ ని ఎక్స్‌పీరియన్స్ చేయాలనే క్యూరియాసిటీతో వాటిని టేస్ట్ చేస్తారు. ఆ సమయంలో కలిగే 'కృత్రిమ ఆనందం' మళ్లీ మళ్లీ మరింత మత్తు కావాలని కోరుకుంటుంది. దీంతో మోతాదు పెరుగుతుంటుంది.

అక్కడ సోనీ ఉన్న తీరును చూసి తల్లీతండ్రి షాకయ్యారు.

మరో నలుగురు అమ్మాయిలు, అబ్బాయిలు ఉన్నారు. మత్తులో ఉన్నట్టుగా కనిపిస్తున్నారు. అడిగిన దానికి ఎవరూ సరిగా సమాధానం చెప్పడం లేదు. వారి చుట్టూ ఉన్న వాతావరణం, వారి వాలకం చూడగానే అర్థమైపోయింది పిల్లలు ఎలాంటి స్థితిలో ఉన్నారో.

• • •

సోనీని బలవంతంగా ఇంటికి తీసుకువచ్చారు.

నిద్రలేచి, ఫ్రెష్ అయి మళ్లీ బయటకు వెళ్లబోతున్న సోనీని ఆపింది తల్లి.

'బయట కాలు పెడితే ఊరుకోను, ఇంట్లోనే ఉండు' అని గద్దించాడు తండ్రి. .

'నన్ను ఆపడానికి మీరెవరు.. నా ఫ్రీడమ్‌ను ఎందుకు చంపేస్తున్నారు. ఏం చేస్తారో చేసుకోండి. నేను వెళతాను..' అని తండ్రి మీద రివర్స్ అయిపోయి బయటకు వెళ్లిపోయింది.

ఇక అలాగే వదిలేస్తే కూతురు దక్కదనుకున్నారు తల్లీదండ్రీ.

ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనేంత దూరం సమస్యను తీసుకెళ్లకుండా మొదట్లోనే సరైన పరిష్కారం దిశగా అడుగులు వేయడం, నిపుణుల సలహాలు పాటించడం మేలు.

సైకిక్ ఎనర్జీ

'నా జీవితం ఇది. నాకు చెప్పడానికి నీవెవరు? కన్నావు కాబట్టి భరించాల్సిందే' అంటారు. పరువు, ప్రతిష్ఠ, చదువు, కెరియర్.. దేనికీ వాల్యూ ఇవ్వరు. సైకిక్‌లా ప్రవర్తిస్తారు. ఇందులో అబ్బాయిలు/అమ్మాయిలు ఇద్దరూ ఉన్నారు. ఇది డ్రగ్ ఎడిక్షన్ పర్యవసానం అనే నిజాన్ని కుటుంబ సభ్యులు జీర్ణం చేసుకోలేకపోతున్నాయి. మా పిల్లలు అలాంటివారు కాదు అనుకొని సమాధాన పరుచుకుంటారు.

కౌన్సెలింగ్ తప్పనిసరి

తాము ముందు అనుకున్న లక్ష్యాలను పక్కన పెట్టేసి, ఇలాంటి వాటికి పిల్లలు అట్రాక్ట్ అవుతుంటారు. అందుకని, అమ్మాయి/అబ్బాయి ఎవరైనా సరే మత్తు పదార్థాలకు సంబంధించిన ప్రతీ సిచ్యుయేషన్ ని డిస్కస్ చేయాల్సిందే. 'మా అమ్మాయి/అబ్బాయి ఇలా చేస్తుంటే పదిమందికి ఏమని చెప్పుకుంటాం. ఈ సమస్యకు ఎవరి దగ్గరకు వెళ్లాలో కూడా తెలియడం లేదు' అని కుమిలిపోతుంటారు. దీనికి సరైన పరిష్కారం సైకలాజికల్ కౌన్సెలింగ్.

– నిర్మలారెడ్డి

అనుమానించాల్సిందే!

పిల్లల కొన్ని చర్యల వల్ల వాళ్ళు డ్రగ్ అడిక్ట్ అవునా కాదా సులువుగా తెలుసుకోవచ్చు.

- ఎక్కువ డబ్బులు కావాలని అడుగుతుంటారు. తరచూ పార్టీలకు వెళ్లడం, నా రూమ్‌లోకి ఎవరూ రావద్దు ... అని ఐసోలేట్ అవుతుంటారు. రెబల్స్ అవుతారు/రివర్స్ అవుతారు. పగటిపూట పడుకోవడం, రాత్రిళ్లు మేల్కోవడం చేస్తుంటారు. పెదవులు ఆరిపోవడం, చూపులో తేడా రావడంతోపాటు, వారి బాడీ లాంగ్వేజ్‌లోనూ మార్పులు వస్తాయి. ఇంట్లోకి వచ్చిన వెంటనే రూమ్‌లోకి వెళ్లి, తలుపులు వేసేసుకున్నా, నాకు వేరే పని ఉంది, నేను ఇప్పుడే రాను.. లాంటి మాటలు మాట్లాడుతున్నా అనుమానించాల్సిందే. చదువు విషయంలో సరిగ్గా లేకున్నా చెక్ చేయాలి. సరైన గైడెన్స్ ఇప్పించాలి. ఎక్కడైనా తేడా వస్తే.. థెరపిస్ట్ దగ్గరకు తీసుకెళ్లాలి.
- నా జీవితం, నా స్వేచ్ఛ అనే భావన అమ్మాయిలకు/అబ్బాయిలకు వచ్చేసింది. కానీ, స్వేచ్ఛ ఎంత ఇవ్వాలో దానికో పరిమితి ఉండాలి. ఏడాది, రెండేళ్ల పిల్లలు వెలుగుతున్న క్యాండిల్‌ను పట్టుకోవడానికి ఉత్సాహం చూపుతారు. కాలుతుందని మనకు తెలుసు, ఆ పిల్లవాడికి తెలియదు. అలాంటప్పుడు మనం ఎలా ఆపుతామో, ఇదీ అంతే అని గుర్తించాలి. నా పిల్లలను నేను కంట్రోల్ చేయాల్సిందే.. అనుకున్నప్పుడు మానిటర్ చేయాల్సిందే. అందుకు తగిన సపోర్ట్ తీసుకోవాల్సిందే.
- మంచి జీవనశైలి గురించి చెబితే ఎవరూ వినరు. వారి ఆలోచనా విధానమే మారాలి. ఎప్పుడూ మోటివేట్ చేసుకుంటూ వెళ్లాలి. అప్పుడు మంచి ఫలితం వస్తుంది. శారీరకంగా దెబ్బతినడం, కెరియర్ పాడవడం, సామాజికంగా చెడు పేరు రావడం ఇలాంటివన్నీ సమస్యలే కాబట్టి ఆలోచనా విధానాన్ని మార్చేటట్టు చేయాలి. అయితే, ఆలోచనా విధానం మారడానికి మందులు ఉండవు. ఉదాహరణకు.. ఐస్‌క్రీమ్ తింటే పడటం లేదు అంటే, తినడం మానేయాలి, తప్పదు. అలాగే, మనకు చెడు చేసేవి ఏవైనా వదిలేయాల్సిందే.
- మత్తు పూర్తిగా వదిలించుకోవాలంటే అది ఆ వ్యక్తిని బట్టి ఉంటుంది. మారాలనే ఆలోచన బట్టి రికవరీ వేగంగా ఉంటుంది. 'డ్రగ్స్ వల్ల నాకు డ్యామేజీ అవుతుంది అనుకున్నప్పుడు పరిష్కారాన్ని వెతుక్కోవాలి అనిపిస్తుంది. ఆల్కహాల్/డ్రగ్స్ తీసుకుంటే బాడీ వెంటనే రియాక్ట్ అవుతుంది. ఒక్కసారిగా మానేసినా అంతే రియాక్ట్ అవుతుంది. అందుకని, డిటాక్స్ అండ్ విత్‌డ్రాయల్ మేనేజ్‌మెంట్ చేయాల్సి ఉంటుంది. మత్తుకు అలవాటుపడటం ఒక రోగం అని గుర్తించాలి. దాని మీద ఒక అవగాహన ఏర్పరుచుకోవడం, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కౌన్సెలింగ్ విధానాల ద్వారా దాన్ని అధిగమించాలి.



– డాక్టర్ గిడియన్, డి-అడిక్షన్ థెరపిస్ట్
లివింగ్ సోబర్, హైదరాబాద్

న్యూస్‌మేకర్


సాబ్రి

మరో స్వర్ణకమలం

సంప్రదాయ నృత్యమంటే ఇష్టం లేని అమ్మాయిని ఆ నృత్యంలో లగ్నం చేసే సినిమా కథ 'స్వర్ణకమలం'. కేరళలో ఇందుకు పూర్తి విరుద్ధమైన కథ జరిగింది. మదరసాలో చదువుకునే ఒక అమ్మాయి కథాకళి పట్ల ఆసక్తితో 80 ఏళ్ల చరిత్ర ఉన్న డాన్స్ స్కూల్‌లో పోరాడి సీటు సాధించుకుంది. కథాకళిలో ముస్లిం అమ్మాయిల ప్రవేశం ఇప్పటి వరకూ లేదు. ఆ నృత్యం నేర్చుకుంటున్న మొదటి అమ్మాయి సాబ్రి.

'చిన్నప్పటి నుంచి కథాకళి చూస్తున్నా. దానికి వేసుకునే మేకప్, దాని కాస్ట్యూమ్స్, ఆ నృత్యవిధానం నన్ను ఆకర్షించాయి. ఎలాగైనా ఆ డాన్స్ నేర్చుకోవాలని చెప్పా. నాన్నకు కూడా ఆ డాన్స్ ఇష్టం. సరే నమ్మా అన్నాడు' అంది సాబ్రి.

ఏడవ క్లాసు పూర్తి చేసిన సాబ్రి ఇప్పుడు తండ్రి నిస్సమ్, తల్లి అనీషాల ప్రోత్సాహంతో కథాకళి నృత్యం నేర్చుకోవడానికి పూనుకుంది. కేరళలోనే కాదు బహుశా దేశంలోనే కథాకళి నేర్చుకుంటున్న తొలి ముస్లిం బాలిక సాబ్రి. అందుకే ఈ అమ్మాయిని అందరూ మెచ్చుకుంటున్నారు. కళకు కులం, మతం భేదం లేదని అంటున్నారు.

దేవుని గుడిలో చూసి..

సాబ్రి కుటుంబం కొల్లంలో నివసిస్తుంది. తండ్రి నిస్సమ్ ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్. వీరి ఇంటి సమీపంలోనే శ్రీ మహాదేవ కోవెల ఉంది. అక్కడ దాదాపు ప్రతి వారం ఏదో ఒక సాయంత్రం కథాకళి నృత్య ప్రదర్శన ఉంటుంది. వృత్తిలో భాగంగా నిస్సమ్ ఆ నృత్య ప్రదర్శన ఫొటోలు తీయడానికి వెళ్లేవాడు. కాలక్షేపంగా ఉంటుందని సాబ్రిని కూడా తీసుకెళ్లేవాడు. 'అలా ఏడేళ్ల వయసు నుంచే నేను కథాకళి నృత్యాన్ని చూస్తున్నాను. ఐదో క్లాసు అయ్యాక ఆ డాన్సును ప్రయివేటు టీచర్ దగ్గరి నుంచి నేర్చుకోవాలనుకున్నాను. కాని కోవిడ్ వల్ల క్లాసులు ఆగిపోయాయి. అదీగాక ఒక ఇన్‌స్టిట్యూట్ నుంచి పరిపూర్ణంగా నేర్చుకోవాలనిపించింది. అందుకే కళామండలంలో చేరాను' అంది సాబ్రి.

మగవారికే కథాకళి

కథాకళి నృత్యం ఒక తపస్సు. దాని కోసం జీవితాన్ని అంకితం చేయాలి. స్త్రీల శరీర ధర్మాలు, గృహ ధర్మాలు వారిని పరిపూర్ణంగా ఈ నృత్యంలో నిమగ్నం కానివ్వవు అనే ఉద్దేశ్యంతో ఈ నృత్యాన్ని ఆది నుంచి పురుషులకే పరిమితం చేశారు. పురుష కళాకారులే కథాకళిలోని స్త్రీల వేషాలను కూడా ధరిస్తారు. ప్రదర్శనను రక్తి కట్టిస్తారు. కథాకళిని పరిరక్షించడానికి కేరళలో ప్రతిష్ఠాత్మకమైన డాన్స్ ఇన్‌స్టిట్యూట్‌లు ఉన్నాయి. అలాంటి వాటిలో ముఖ్యమైనది త్రిసూర్‌కు దగ్గరగా ఉన్న చెరుతురితి అనే ఊరిలోని 'కళామండలం'. ఇది కథాకళిని బాల్యం నుంచి రెసిడెన్షియల్ పద్ధతిలో నేర్పుతుంది. అంటే ఇక్కడ మామూలు స్కూలు, కథాకళి స్కూలు కలిసి నడుస్తాయి. 90 ఏళ్లుగా నడుస్తున్న ఈ సంస్థలో పూర్తిగా అబ్బాయిలకే ప్రవేశం. అయితే గత సంవత్సరమే అమ్మాయిలు కూడా చేరొచ్చు అని అనుమతి ఇచ్చారు. ఎవరూ చేరలేదు. ఈ సంవత్సరం పది మంది అమ్మాయిలు చేరితే వారిలో ఒకమ్మాయి సాబ్రి.


డ్యాన్స్ స్కూల్ 'కళామండలం' వద్ద సాబ్రి


డ్యాన్స్ క్లాస్‌లో ...

కఠిన శిక్షణ

కళామండలంలో 8 వతరగతిలో చేరిన సాబ్రి ఇక అక్కడే హాస్టల్‌లో ఉండిపోవాలి. ఉదయం 4.30 నుంచి లేచి కథాకళి పాఠాలు నేర్చుకోవాలి. 9.30 నుంచి మళ్లీ స్కూలు పాఠాలు నేర్చుకోవాలి. సాయంత్రం ఊళ్లో ఎక్కడ కథాకళి ప్రదర్శన జరుగుతుంటే అక్కడకు తీసుకెళ్లి చూపిస్తారు. 'కథాకళిలోని ప్రదర్శనలన్నీ హిందూ పురాణాల ఆధారంగా ఉంటాయి. మరి నీకు ఆ పాత్రలు పోషించడంలో ఇబ్బంది ఏమీ లేదా' అంటే 'అలా ఏమీ లేదు' అంటుంది సాబ్రి. తండ్రి నిస్సమ్ కూడా 'మా అమ్మాయి డాన్స్ నేర్చుకోవడంలో కళ అందరూ నేర్చుకునే హక్కు నిరూపితం అయ్యింది. ఈ నృత్యం నేర్చుకోవడంలో మా మతస్థుల నుంచి ఎటువంటి అభ్యంతరం లేదు' అని తెలిపాడు.

నాలుగైదేళ్లొచ్చినా ఇంకా ముద్దు ముద్దుగా మాట్లాడే పిల్లలే మనకు తెలుసు. అలాంటిది రెండేళ్లకే గలగల మాట్లాడుతూ అందరూ ఆశ్చర్యపోయేలా చేశాడా బుడతడు. అంతేనా? తొమ్మిదో ఏటనే "నాది స్కూలు సిలబస్ చదివి, హోం వర్క్ చేసే వయసు కాదు" అని చెప్పి ఏకంగా కాలేజీ పుస్తకాలు చేతబట్టాడు. నాలుగేళ్లలో చకచకా డిగ్రీ పూర్తి చేసేశాడు. ప్రస్తుతం పద్నాలుగేళ్ల వయసులో ఎలాన్ మస్క్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా హార్డ్‌గా పని చేస్తున్నాడు కైరాన్ క్వాజీ.

పద్నాలుగేళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజినీర్!


కైరాన్ క్వాజీ

నేటి టెక్నాలజీ టీనేజర్స్ కొందరు అది ఇది అనిచెబుతూ ఎంజాయ్ చేస్తూ సమయాన్ని వృథా చేస్తుంటే.. కైరాన్‌లాంటి కుర్రాళ్లు మాత్రం వయసుకు మించిన ప్రతిభతో అద్భుతాలు సృష్టిస్తూ ఔరా అనిపిస్తున్నారు. అత్యంత వేగం, కచ్చితత్వంతో కూడిన ప్రతిభా పాటవాలతో ప్రఖ్యాత స్పేస్ ఎక్స్ కంపెనీ రిక్రూట్‌మెంట్ టెస్ట్ పాసైన కైరాన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎంపికవడమేగాక, కంపెనీలోనే తొలి అతిపిన్న ఇంజినీర్‌గా నిలిచాడు.

అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోకు చెందిన జూలియా, ముస్తాహిద్ క్వాజీ దంపతులకు 2009 జనవరి 27 కైరాన్ పుట్టాడు. చిన్నప్పటి నుంచి ఎంతో చురుకుగా ఉత్సాహంగా ఉండే కైరాన్‌ను గమనించిన తల్లిదండ్రులు.. చక్కగా ప్రోత్సహించేవారు. తెలివిగా చదువుతూ ..ఏడో ఏట యంగ్‌వాంక్స్ కోడింగ్ అకాడమిలో చేరి పైథాన్ ప్రోగ్రామింగ్‌ను నేర్చుకున్నాడు. దీంతోపాటు మెషిన్ లెర్నింగ్‌ను కూడా వంటబట్టించుకున్నాడు.


విధి నిర్వహణలో క్వాజీ


తల్లిదండ్రులతో...

తొమ్మిదేళ్లకే కాలేజీ..

నాది స్కూల్ హోం వర్క్ చేసే వయసు కాదని తన ప్రతిభతో తొమ్మిదో ఏటనే లాస్‌పాసిటాస్ కాలేజీలో చేరి ఈ కాలేజీ చరిత్రలో తొలి పిన్న వయసు విద్యార్థిగా చరిత్ర సృష్టించాడు. ఆ తరువాత పదకొండేళ్లకే మ్యాథమేటిక్స్‌లో డిగ్రీ చదువుతూనే శాంత క్లారా యూనివర్శిటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ కూడా చదివాడు. ఇదే యూనివర్శిటీలో ఏడాది మాస్టర్స్‌ని పూర్తిచేశాడు. ఇటీవల సాంకేతిక ఫస్ ఇంటర్వ్యూ ప్రాసెస్‌ను అవలీలగా అధిగమించి స్పేస్‌ఎక్స్‌లోని స్టార్‌లింక్ విభాగంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎంపికయ్యాడు. దేనైనా ఇట్టే పట్టేసే గుణగణాలే కైరాన్‌ని స్పేస్ ఎక్స్ ఉద్యోగిగా మార్చాయి. అందుకే చిన్న వయసులో డిగ్రీలేగాదు, ఉద్యోగాన్ని కూడా కొట్టేశాడు.

ప్రతిభ, పట్టుదల, కృషి ఎక్కువ

"కైరాన్ చిన్నప్పటి నుంచి చాలా చురుకుగా ఉండేవాడు. అ చురుకుదనాన్ని వెన్నుతట్టి ప్రోత్సహించేవాళ్లం. దాంతో వాడు తన ప్రతిభాపాటవాలకు మరింత పదును పెట్టుకుని టీనేజ్‌లోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా మారాడు. లాస్‌పాసిటాస్ కాలేజీలో చదివేటప్పుడు అకడమిక్ సిలబస్‌ను నేర్చుకోవడమేగాక, స్టాఫ్ అసిస్టెంట్‌గా, స్టెమ్ ట్యూటర్‌గాను పనిచేసేవాడు. ఇతర ట్యూటర్‌లకు సాయం చేస్తూ తన నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నాడు. వేసవి సెలవుల్లో సైబర్ ఇంటిలిజెన్స్ ఇంటర్న్‌షిప్ చేశాడు. దీనితోపాటు బ్లాక్‌బర్డ్ ఏఐలో కూడా ఏఐ ఇంటర్న్‌గా చేశాడు. శాంతక్లారా యూనివర్సిటి, ఇంటెల్ మెంటర్స్ కూడా కైరాన్‌కు మంచి గైడెన్స్‌ను అందించారు. చేతిరాత, స్పెల్లింగ్, నోట్ టేకింగ్, ఇతర భాషలు నేర్చుకోవడం కాస్త కష్టమైనా.. పట్టుదల, కృషితో నేర్చుకున్నాడు. ప్రస్తుతం బెంగాలీ, మాండరిన్ నేర్చుకుంటున్నాడు. ఎప్పుడు కొత్తదాన్ని నేర్చుకోవడానికి కైరాన్ ఆసక్తి కనబరుస్తాడు. ఆ ఆసక్తే వాడి భవిష్యత్తుని ఉజ్వలంగా తీర్చిదిద్దుతోంది'' అని కైరా తల్లిదండ్రులు చెప్పుకొచ్చారు.

"నా నెక్ట్స్ స్టాప్ స్పేస్‌ఎక్స్: ఈ గ్రహంలోనే అత్యంత చక్కని కంపెనీలో స్టార్‌లింక్ ఇంజినీరింగ్ టీమ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేరబోతున్నాను. వయసును బట్టి ఉద్యోగాలలో నియమించే కంపెనీలకు భిన్నంగా, నా ప్రతిభ, పరిపక్వతలను దృష్టిలో పెట్టుకుని స్పేస్‌ఎక్స్ నాకు ఈ ఉద్యోగం ఇచ్చింది" అని తన లింక్డ్ ఇన్ అకౌంట్ ద్వారా కైరాన్ తన కలల జాబ్ గురించి సంతోషంతో చెప్పుకున్నాడు.

ది బాస్ లేడీ

నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్ఎస్‌డీ) స్టూడెంట్ అయిన ఆష్క గొరాదియకు బాలీవుడ్‌లో బ్రేక్ రాలేదు. అయితే ఆ అసంతృప్తి ఆమె మాటల్లో ఎప్పుడూ తొంగి చూసేది కాదు. ప్రతి అడుగులో ఆత్మవిశ్వాసం కనిపించేది. ఆ ఆత్మవిశ్వాసమే ఆమెను వ్యాపార రంగం వైపు నడిపించింది. 'రెనీ కాస్మెటిక్స్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఘనవిజయాన్ని సాధించింది...


ఆష్క గొరాదియ

బాల నటిగా కెరీర్ మొదలు పెట్టింది ఆష్క గొరాదియ. తన ప్రయాణంలో రకరకాల సవాళ్లు, కష్టాలు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. వాటివల్ల పోరాటం ఎలా చేయాలో తనకు తెలిసింది. హిందీ సినిమాల్లో నటిస్తున్న కాలంలోనే హాలీవుడ్ కలలతో అమెరికా వెళ్లింది. అక్కడ పెద్దగా అవకాశాలు రాకపోవడంతో తిరిగి ఇండియాకు వచ్చింది.

బాలీవుడ్ సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసి, ఎన్నో టీవి సీరియల్స్‌లో నటించి 'టీవి స్టార్'గా పేరు తెచ్చుకున్న ఆష్క ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రయాణం మొదలుపెట్టాలనుకుంది. అయితే అది అంత తేలిక కాదనేది తనకు తెలియని విషయమేమీ కాదు. తన కళ్ల ముందే ఎన్నో అనుభవాలు ఉన్నాయి. అయితే అవేమీ తనకు అడ్డు కాలేదు. మొదటి అడుగుగా సొంతంగా ప్రొడక్షన్ కంపెనీ మొదలుపెట్టిన ఆష్క ఎన్నో సక్సెస్‌ఫుల్ టీవీ షోలు చేసింది. ఆ తరువాత ట్రావెలర్స్ కోసం ఒక మొబైల్ యాప్ వెంచర్‌ను లాంచ్ చేసింది. ఆ తరువాత స్నేహితులతో కలిసి ప్రారంభించిన 'రెనీ కాస్మెటిక్స్' ఆమెను స్టార్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా మార్చింది.

ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఆష్క ఘనవిజయం ఎంతోమంది ఔత్సాహికులకు స్ఫూర్తి ఇచ్చింది. ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలనుకునే వారికి ఆమె చెప్పిన కొన్ని సలహాలు...

కల కనాలి... ముందుకు కదలాలి: ఒకరి నుంచి స్ఫూర్తి పొందిన తరువాత కల శ్రీకారం చుట్టుకుంటుంది. అయితే అది సాకారం కావాలంటే ఆచరణలోకి రావాలి. పనికి సంబంధించి స్థాయిని పెంచుకుంటూ పోవాలి.

అంకితభావం ప్లస్ కష్టం: నటన అయినా వ్యాపారమైనా సక్సెస్ కావాలంటే అంకితభావంతో పాటు బాగా కష్టపడాలి. ఒకవేళ విజయం సాధించకపోయినా మనం కన్న కలకు దూరం కావద్దు. ఓటమి నేర్పే పాఠాలతో ముందుకు వెళ్లాలి. సానుకూల ఆలోచనలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

రిస్క్‌కు భయపడితే రిస్క్: ఈతకొట్టడానికి నీళ్లలోకి దిగిన తరువాత నీళ్లకు భయపడితే ఎలా! వ్యాపారం అన్నాక రిస్క్ ఉంటుంది. అంత మాత్రాన వెనక్కి తగ్గనవసరం లేదు. మూస ఆలోచనలకు భిన్నంగా కొత్తగా ఆలోచిస్తే విజయం మన చెంతకు నడిచొస్తుంది.

కోవిడ్ కల్లోల సమయంలో ఎన్నో వ్యాపారాలలాగే మా వ్యాపారం కూడా దెబ్బతింది. 'ఇక నీకు నటనే దిక్కు' అనేవాళ్లు. అయితే నేనెప్పుడూ నమ్మకం కోల్పోలేదు. మంచిరోజులు వస్తాయని గట్టిగా నమ్మాను. అది నిజమైంది.



నెట్‌వర్క్: నటనకైనా, వ్యాపారానికైనా పది మందితో పరిచయం ముఖ్యం. ఈవెంట్స్, వర్క్ షాప్‌లకు హాజరుకావడంతో పాటు ఆన్‌లైన్ కమ్యూనిటీలతో టచ్‌లో ఉండాలి. సామాజిక సంబంధాల ద్వారా కొత్త విషయాలు తెలుస్తాయి. ఆలోచన పరిధి విస్తరిస్తుంది. ముందుకు వెళ్లడానికి కావాల్సిన ధైర్యం లభిస్తుంది.

యుఎస్పీ: 'మా బ్రాండ్ ఇది' అని మాత్రమే కాదు 'మా యూఎస్పీ ఇది' అని గర్వంగా చెప్పుకోగలగాలి. మా బ్రాండ్ విషయానికి వస్తే హై-క్వాలిటీ, గతంలో ఎప్పుడూ చూడని ప్యాకేజీ, పాకెట్-ఫ్రెండ్లీ ప్రైస్ అనేవి మా యూఎస్పీ. మార్కెట్ ప్లేస్‌లకు వెళుతూ ఎప్పటికప్పుడు ట్రెండ్స్ తెలుసుకోవాలి.

ఆష్కకు నటన, యోగా, పోల్ డ్యాన్స్, ట్రావెల్ అంటే ఇష్టం. ఇక ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అనేది వాటికంటే రెండు రెట్లు ఎక్కువ ఇష్టమైనది. సినిమాలు, టీవీ సీరియల్స్‌లో ఆష్క 'బిజినెస్ ఉమన్' పాత్ర ధరించలేదు. అయితే నిజ జీవితంలో మాత్రం ఆమె 'బిజినెస్ ఉమన్'గా అద్భుత విజయాన్ని సాధించింది. 'ది బాస్ లేడీ' అని స్నేహితులతో పిలిపించుకుంటోంది.